క్లుప్తంగా

చెత్త కుప్పలను తొలగించరా..!



బీసీ కాలనీ సమీపంలో పేరుకుపోయిన చెత్త కుప్పలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని వల్లూరు గ్రామంలో పారిశుద్ధ్యం రోజురోజుకూ క్షీణిస్తోందని గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీసీ కాలనీకి వెళ్లే రహదారిలో చెత్త కుప్పలు దట్టంగా పేరుకుపోయాయని, దీంతో రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. రహదారి పక్కనే చెత్తను డంప్ చేయడంతో దుర్వాసన వెదజల్లుతోందని, దోమలు, ఈగల ఉధృతి ఎక్కువైందని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కల్పించుకుని చెత్త కుప్పలను తొలగించాలని కోరుతున్నారు.

మోడల్ ప్రశ్నపత్రాల పంపిణీ



విద్యార్థులకు మోడల్ పేపర్లు పంపిణీ చేస్తున్న అప్పలనాయుడు

చీపురుపల్లి: పదోతరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు యూటీఎఫ్ తయారు చేయించిన మోడల్ పేపర్లు ఎంతగానో దోహదపడతాయని యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మీసాల అప్ప లనాయుడు చెప్పారు. మండలంలోని పేరిపి గ్రామంలో పదోతరగతి విద్యార్థులకు మోడల్ పేపర్ బుక్ లెట్లను ఆదివారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసమే ఏటా యూటీఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ పేపర్లు తయారు చేసి ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


పేదలను ఆదుకోవడమే ధ్యేయం



సిమెంట్ అందజేస్తున్న రమణ, తదితరులు

చీపురుపల్లి: పేదలను ఆదుకోవడమే ధ్యేయంగా తమ ట్రస్టు పని చేస్తోందని శ్రీ దుర్గా మల్లేశ్వర సేవా ట్రస్టు వ్యవస్థాపకుడు ముల్లు రమణ తెలిపారు.ఇళ్ల నిర్మాణం చేసుకుంటున్న పేదలకు ట్రస్టు తరఫున ఆదివారం సహాయం అందించారు. గరివి డి మండలంలోని కుమ రాం గ్రామానికి చెందిన గుసిడి పెంటయ్యకు 40 బస్తాల సిమెంట్, రఘుమండ సత్యవతికి 15 బస్తాల సిమెంట్‌ను ఆ గ్రామ సర్పంచ్ ముల్లు రమాదేవితో కలిసి పట్టణంలోని తన నివాసం వద్ద అందజేశారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఇంటి నిర్మాణం, ఆలయాల నిర్మాణంతో పాటు ఆడ పిల్లల వివాహాలకు తమ ట్రస్టు సహాయ, సహకారాలు అందజేస్తోందన్నారు. బెల్లాన రమణ, అంపోలు సత్యం, రౌతు నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.


ముగిసిన ఆలయ ప్రతిష్ఠోత్సవాలు



ఆలయ ప్రాంగణంలో పూజలు చేస్తున్న వేద పండితులు

కొత్తవలస: మండలంలోని రామలింగాపురం గ్రామంలో మూడు రోజులుగా కొనసాగిన రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు ఆదివా రంతో ముగిశాయి. వేదపండితులు అంపోలు ఉమామహేశ్వరశర్మ, కొల్లూరు శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు.అనంతరం శివ పార్వతుల కల్యాణం జరిపించారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నదానం చేశారు. గ్రామస్తులతో పాటు చుట్టు పక్క గ్రామాలకు చెందిన భక్తులు హాజరై అన్నప్రసాదం స్వీకరించారు.

ఎన్నికల ప్రచారం



ప్రచారం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

వేపాడ: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కె.విజయగౌరికి మద్దతుగా మండలంలో యూటీఎఫ్ నాయకులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. వేపాడ, వల్లం పూడి, ఆకులసీతంపేట, అరిగిపాలెం, బొద్దాం గ్రామాల్లో ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు.సీఐటీయూ నాయకుడు చల్లా జగన్, యూటీఎఫ్ నాయకులు జగదీశ్వరరావు, ఆర్.రామసత్యం పాల్గొన్నారు.

తగ్గిన చికెన్ ధరలు..



నరవ వద్ద వెలవెలబోతున్న చికెన్ దుకాణం



విజయనగరం రింగురోడ్డులోని రాజీవ్‌నగర్ సమీపంలో కిటకిటలాడుతున్న చేపల మార్కెట్

- బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్
- వెలవెలబోతున్న చికెన్ సెంటర్లు
- కిటకిటలాడుతున్న చేపల మార్కెట్లు

విజయనగరం గంటస్తంభం: బర్డ్ ఫ్లూ ప్రభావం జిల్లాలో బాగానే కనిపిస్తోందని చెప్పడానికి పలుచోట్ల ఖాళీగా దర్శనమిస్తున్న చికెన్ సెంటర్లను చూస్తేనే అర్థమైపోతోంది. చికెన్ తినడంతో ఆరోగ్యం దెబ్బతింటుందన్న భయం ప్రజల్లో బాగానే పెరిగిందనడానికి ఆదివారం జరిగిన అమ్మకాలు చూస్తేనే తెలుస్తోంది. కొద్ది రోజుల కిందట రూ. 220 నుంచి 240 రూపాయల మధ్య ఉన్న చికెన్ ధర నేడు రూ. 140 నుంచి 160 రూపాయలకు పడిపోయింది. కొనుగోలు దారులు పెద్దగా లేకపోవడంతో దాదాపు అన్ని చికెన్ సెంటర్లు ఆదివారం ఖాళీగానే దర్శనమిచ్చాయి. బ్రాయిలర్ చికెన్ తినేందుకు ప్రజలు భయపడుతున్నారు.

కిటకిటలాడిన చేపల దుకాణాలు..

బ్రాయిలర్ చికెన్ తిని అనారోగ్య పాలవడం కంటే చేపలే శ్రేష్టమని పలువురు అభిప్రాయపడుతున్నారు. దీంతో విజయనగరం రింగురోడ్డులోని రాజీవ్‌నగర్ కాలనీ వద్ద.. ఆర్అండ్‌బీ రైతుబజార్ వద్ద.. గంటస్తంభం మార్కెట్‌లోని చేపల మార్కెట్లు కిటకిటలాడాయి. చేపల ధరలు కూడా అధికంగా ఉన్నా తప్పనిసరి పరిస్థితుల్లో కొనాల్సి వస్తోందని పలువురు మాంసాహారులు అంటున్నారు. అలాగే మటన్ షాపుల వద్ద జనం క్యూలైన్లలో ఉండడం కనిపిస్తోంది. ఏదైతేనేం బర్డ్‌ఫ్లూ దెబ్బకి చేపలు, మటన్‌కు డిమాండ్ పెరిగింది.

రోడ్లపైనే మార్కెట్..

రోడ్లపైనే చేపల మార్కెట్ ఉండడంతో ఆయా రోడ్లు రద్దీగా మారాయి. మార్కెట్‌కు వస్తున్న కొనుగోలుదారులు రోడ్లపై వాహనాలు నిలిపివేయడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.

పలుచోట్ల వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. భారీ వాహనాలు వచ్చే సమయంలో అయితే గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. విజయనగరం రింగురోడ్డులోని రాజీవ్‌నగర్‌కు సమీపంలో ఉన్న చేపల మార్కెట్, ఆర్అండ్‌బీ రోడ్డులో చేపల మార్కెట్, జమ్మునారాయణపురంలో మటన్ విక్రయాల వద్ద ఏర్పడ్డ రద్దీతో ఇబ్బందికర పరిస్థితులే ఏర్పడుతున్నాయి.

రక్తదానం ప్రాణదానంతో సమానం

- సర్వజన ఆస్పత్రి రక్తనిధి కేంద్రం వైద్యుడు గోపాలరెడ్డి



సాధన యువజన సంఘ అధ్యక్షుడు దుర్గాప్రసాద్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న డాక్టర్ గోపాలరెడ్డి

విజయనగరం ఫోర్ట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి రక్తనిధి కేంద్రం వైద్యుడు గోపాలరెడ్డి అన్నారు. జరజాపుపేట సాధన యువజన సంఘం ఏర్పాటు చేసి 17 ఏళ్ల పూర్తయిన నేపథ్యంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న సాటి మనిషి ప్రాణాలు కాపాడే అవకాశం మనుషులకే ఉందన్నారు. వేసవిలో రక్తం కొరత ఉంటుంది కాబట్టి ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ ఏడాదికి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చన్నారు. సాధన యువజన సంఘ అధ్యక్షుడు పోలుబోతు దుర్గాప్రసాద్ 65వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో బి. రామకృష్ణారావు, బ్లడ్ బ్యాంక్ కౌన్సిలర్ అప్పలనాయుడు, కనకల బ్రమ్మేష్, అవనాపు అప్పలరాజు, బండారు సందీప్, గర్భాపు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



మొక్కలు నాటుతున్న వాసవీ క్లబ్ సభ్యులు

విజయనగరం రూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ అమర్ నాథ్ అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న పర్యావరణ హిత సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని రామనారాయణంలో ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రూ. 60 వేల విలువైన మామిడి, కమలాలు, ఖర్జూర మొక్కలు నాటించారు. విశ్వ పరివార్ సభ్యులు పేర్ల రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ సభ్యులు దుర్గ, కార్యదర్శి ఉషామాధురి, కోశాధికారి సాయినిర్మల, పర్యవేక్షణాధికారి డీవీఎస్ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

పాడు 'బడి'ంది..!



పినతరిమిలో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పినతరిమి గ్రామంలో ప్రాథమిక పాఠశాలకు చెందిన శిథిల భవనాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. సుమారు 10 ఏళ్ల కిందట పాఠశాల భవనం శిథిలం కావడంతో అప్పటి నుంచి ఒకే గదిలో ఐదు తరగతులకు చెందిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు. విడిచిపెట్టిన పాఠశాల భవనం ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల కాలం నుంచి భవనం పాడుబడి ఉండడంతో విషసర్పాలు వస్తున్నాయని చెబుతున్నారు. విద్యార్థులు పాఠశాల భవనం వద్దనే తిరుగుతూ ఉంటారని సంబంధిత అధికారులు స్పందించి శిథిల భవనం తొలగించి కొత్త భవనం నిర్మించేలా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

గ్రూప్- 2 మెయిన్స్ పరీక్షలకు ఏర్పాట్లు

బొండపల్లి: ఈనెల 23వ తేదీన గ్రూప్-2 మెయిన్స్ పరీక్షల నిర్వహణకు మండలంలోని గొట్లాం గాయిత్రీ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు చేస్తున్నామని తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 480 మంది అభ్యర్థులు పరీక్షలు రాసేందుకు 20 గదులను కేటాయించినట్లు పేర్కొన్నారు. 23వ తేదీన ఉదయం 9:30 గంట ల నుంచి మధ్యాహ్నం 12:30 గం టల వరకు, అలాగే మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు పూటలా పరీక్షలు ఉంటాయని స్పష్టం చేశారు.అభ్యర్థులు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవా లని సూచించారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమ లులో ఉంటుందని తెలిపారు.

ప్రతిరైతుకు విశిష్ఠ సంఖ్య

- సంక్షేమ పథకాల మంజూరుకు యూనిక్ ఐడీ నంబర్ ప్రామాణికం
- రైతు సేవాకేంద్రాల్లో శరవేగంగా సాగుతున్న ప్రక్రియ



రెల్లివలసలో విశిష్ట సంఖ్య నమోదు చేస్తున్న ఏవో నీలిమ,తదితరులు



మొక్కజొన్న సాగును పరిశీలిస్తున్న అధికారులు, రైతులు (ఫైల్)

పూసపాటిరేగ: అన్నదాతలకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సాగుభూమి ఉన్న ప్రతి రైతుకు 14 అంకెలతో కూడిన విశిష్ట గుర్తింపు సంఖ్యా పత్రం జారీ చేసే ప్రక్రియ ప్రారంభమైంది. రాబోయే రోజుల్లో విశిష్ట సంఖ్య ఉన్న రైతులకు మాత్రమే సంక్షేమ పథకాల మంజూరుకు కసరత్తు జరుగుతోంది. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతులు యూనిక్ ఐడి (విశిష్టసంఖ్య)కార్యక్రమం ప్రారంభమైంది. పూసపాటిరేగ మండలంలో మొక్కజొన్న, వరి, ఉద్యానవన పంటలైన టమాటో, వంకాయ, గోరుచిక్కుడు, బెండ, కాకర, క్యాబేజీ పంటలు సాగవుతున్నాయి. సాగు విస్తీర్ణంలో భూమి అంతటికీ నమోదు ప్రక్రియ జరగనుంది. పూసపాటిరేగ మండలంలో ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం సుమారు 6 వేల ఎకరాలు కాగా, రబీలో 4 వేల ఎకరాల వరకు సాగవుతోంది. మండల పరిధిలో సుమారు 10 వేల మంది రైతులకు విశిష్ట సంఖ్య నమోదు చేయాల్సి ఉంది. సొంత భూమి ఉన్న రైతులు అందరు రైతు సేవా కేంద్రాలకు ఆధార్ కార్డు, పాస్‌పుస్తకం, వన్‌బీ, ఫోన్ నంబర్ లింక్ అయిన ఫోన్ తీసుకువెళ్లి నమోదు చేసుకున్నట్లయితే ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ఓటీపీ మూడు సార్లు వచ్చిన తరువాత 14 అంకెలతో కూడిన విశిష్ట సంఖ్య యాప్‌లో నమోదవుతుంది.

ప్రభుత్వ పథకాలు, సబ్సిడీతో పాటు ఇతర వ్యవసాయ సంబంధిత సేవలు పొందడానికి ఈ సంఖ్య అధికారికంగా పనిచేస్తుంది. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీపై వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు, రాయితీపై సూక్ష్మపోషకాలు, సూక్ష్మసేద్యంపై రాయితీ, పంట రుణాలు, పెట్టుబడి సాయం తదితర పథకాలు పొందే వీలుంటుంది.

గుర్తింపు సంఖ్య మెలిక

సంక్షేమ పథకాల మంజూరుకు గుర్తింపు సంఖ్య మెలిక పెట్టడంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. ఎకరా భూమి కంటే తక్కువ ఉన్న రైతులకు పథకాల మంజూరులో అనర్హత వేస్తారనే ప్రచారం సాగుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సెంటు భూమి నుంచి 10 ఎకరాల వరకు భూమి ఉన్న ప్రతి రైతుకు రైతు భరోసా, పీఎం కిసాన్ మంజూరయ్యేది. నేటి పరిస్థితి చూస్తే గత ఏడాది రైతు భరోసా రాలేదు. ఈఏడాది కూడా పథకాల మంజూరుకు ఎటువంటి నిబంధనలు పెడతారో అని రైతుల్లో ఆందోళన నెలకొంది. సంక్షేమ పథకాలు ఎప్పుడు మంజూరు చేస్తారో అని రైతులు ఎదురు చూస్తున్నారు.

ఆందోళనగా ఉంది

అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల మంజూరుకు విశిష్ట సంఖ్య మెలిక పెట్టడంతో ఆందోళనగా ఉంది. గతంలో సొంత భూమి ఉన్న వారితో పాటు కౌలు రైతులకు పథకాలు అందేవి. నేటి పరిస్థితి చూస్తే భిన్నంగా ఉంది. కూటమి సర్కారు వచ్చినప్పటి నుంచి పథకాలు ఆగిపోయాయి. ఇప్పటికైనా రైతులకు సాగు పెట్టుబడికి పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాలు మంజూరు చేయాలి.

కె. వెంకటరావు, రైతు బూడి వీధి

ఇళ్ల మంజూరు ఎప్పుడు...?

- కూటమి సర్కార్ వచ్చిన తర్వాత ఒక్క ఇల్లూ మంజూరు చేయని వైనం
- ఒక్కరికీ సెంటు స్థలం ఇచ్చిన పాపాన పోలేదు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల పేరిట వెలసిన ఊళ్లు



బొండపల్లి మండలం గొట్లాం గ్రామంలోని జగనన్న కాలనీలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఇళు



గజపతినగరం మండలంలోని పురిటిపెంట జగనన్న కాలనీ



గంట్యాడ మండలంలోని సిరిపురంలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఇల్లు

గంట్యాడ: తాము అధికారంలోకి వస్తే పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా అడిగిన ప్రతీ ఒక్కరికి ఇల్లు మంజూరు చేస్తామని ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఊరూరా గొప్పలు చెప్పారు. గృహ నిర్మాణానికి పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల స్థలం మంజూరు చేస్తాం, ఇప్పటి వరకు మంజూరై పట్టాలు పొందిన వారికి ప్రభు త్వం నుంచి పక్కా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తాం, ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షల ఆర్థిక సా యం అందిస్తామని కరపత్రాలు పంపిణీ చేశారు. దీంతో కొత్తగా ఇళ్లు నిర్మించు కోవాలనుకున్న వారు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. కానీ కూటమి ప్రభుత్వంలో వారి ఆశలు ఎప్పటికి నెరవేరుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. కూటమి అధికారం లోకి వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్నా ఇంతవరకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదు. ఇళ్ల పట్టాల ఊసే లేదు.

గజపతినగరం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్నలే అవుట్లతో పాటు, సొంత స్థలాల్లో మంజూరైన ఇళ్ల వివరాలు

మండలం	మంజూరైన ఇళ్లు
బొండపల్లి	2,037
దత్తిరాజేరు	1,932
గజపతినగరం	1,198
గంట్యాడ	2,919

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సొంత స్థలం లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వమే భూములు కొనుగోలు చేసింది. ప్రభుత్వం సేకరిం చిన భూముల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లను తలపించే విధంగా లేఅవుట్లు వేసి ప్లాట్లను సిద్ధం చేసి, ఇళ్ల పట్టాలు అందజేయడంతో పాటు ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం కూడా అందించింది. లేఅవుట్లలో రోడ్ల నిర్మాణం, విద్యుదీకరణ, రక్షిత మంచినీటి ట్యాంకులు, కుళాయిల ఏర్పాటు వంటి సదుపాయాలు కల్పించారు. గంట్యాడ మండలానికి 2,919 ఇళ్లు మంజూరు చేశారు. సొంత స్థలం ఉన్న 1,821 కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయగా వీటిలో 1,249 నిర్మాణాలు పూర్తయ్యాయి. 572 నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. అలాగే స్థలాలు లేని 1,098 కుటుంబాలకు జగన న్న కాలనీలో స్థలాలు ఇచ్చి ఇళ్లు మంజూరు చేయగా 469 నిర్మాణాలు పూర్తయ్యాయి, 629 వివిధ దశల్లో ఉన్నాయి. అప్పటిలో ఇళ్ల నిర్మాణం చేపట్టిన వారికి ప్రభుత్వం బిల్లులు కూడా త్వరితగతిన చెల్లించింది. కానీ నేడు ప్రభుత్వం అసలు ఇళ్లే మంజూరు చేయడం లేదు.

550 మందిని గుర్తించాం..

మండలంలో ఇంకా ఎవరికీ కొత్త ఇళ్లు మంజూరు చేయలేదు. ప్రధానమంత్రి ఆవాసయోజన (పీఎం ఏవై 2.0)లో భాగంగా చేసిన సర్వేలో ఇళ్ల కోసం సర్వే చేసి 550 మందిని గుర్తించాం. వీరికి త్వరలో ఇళ్లు మంజూరయ్యే అవకాశం ఉంది.

– రాజ్ గోపాల్, గృహనిర్మాణశాఖ ఏఈ

రవిబాబుకు అంతిమ వీడ్కోలు



రవిబాబు పాడె మోస్తున్న సూఫీ పీఠాధిపతులు, భక్తులు, కుటుంబ సభ్యులు

- నివాళులర్పించిన మంత్రి కొండపల్లి, మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం టౌన్: సూఫీ ఆధ్యాత్మిక చక్రవర్తి అతావుల్లా షరీఫ్‌షా తాజ్ ఖాదరీ బాబా ప్రియశిష్యుడు, సామాజిక సేవకుడు లింగం రవిబాబు పార్థివ దేహానికి ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, సీఐలు శ్రీనివాసరావు, నరసింహ మూర్తి, తదితరులు రవిబాబు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. సూఫీ సద్గురువు అతావుల్లా బాబా కుమారులు చీమలపాడు దర్గా పీఠాధిపతి ఖాజా మొహియుద్దీన్ బాబా, విజయనగరం దర్గా నిర్వాహకులు డాక్టర్ ఖలీల్‌బాబు, వాస్తు శిల్పి జాఫర్ సిద్దిక్ బాబు, తదితరులు సూఫీ సంప్రదాయం ప్రకారం గులాబీ గజమాలలు వేసి, ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. అనంతరం పాడెను మోసి ఆయన పట్ల తమకున్న ఆప్యాయతను చాటుకున్నారు. కులమతాలకతీతంగా హిందువులు, క్రైస్తవులు, ముస్లింలు వేలాది మంది తరలివచ్చి నివాళులర్పించారు.